క్లుప్తంగా

తాడిగడపలో మంత్రి జోగి రమేష్ ప్రచారం



పెనమలూరు: తాడిగడప గ్రామంలో మంగళవారం రాత్రి మంత్రి జోగి రమేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న ఆశయసాధనకు తాను ప్రజల మధ్యలో ఉండి పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జోగి రమేష్ నామినేషన్

పెనమలూరు: పెనమలూరు ప్రజలు తనను ఆశీర్వదించి ఈ ఎన్నికలలో ఘన విజయం సాధించి పెట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి జోగి రమేష్ విజ్ఞప్తి చేశారు. తాను బుధవారం ఉదయం పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నానని తెలిపారు. నామినేషన్ సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటలకు పోరంకి సెంటర్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా పెనమలూరుకు వెళ్లి ఆర్‌ఓకు నామినేషన్ దాఖలు చేస్తానని తెలిపారు.

ఎన్నికల ప్రచార ప్రత్యేక పాట ఆవిష్కరణ



పెనమలూరు: గంగూరులోని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం జై జోగి రమేష్ ఎన్నికల ప్రత్యేక పాటను మంత్రి జోగి రమేష్ ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జోగి రమేష్ పై ప్రత్యేక పాటను రూపొందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు యడ్లపల్లి రామ్‌సుధీర్, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, నేతలు కర్రా ఆదిశేషారావు, గుమ్మడి అన్వేష్, మరీదు శ్రీనివాసరావు, శీలం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వ్యక్తి అదృశ్యం కేసును పోలీసులు మంగళవారం నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్ కాలువ కట్టపై జక్కంపూడి వరలక్ష్మి కుటుంబ సభ్యులతో నివశిస్తోంది. ఆమెకు ముగ్గురు పిల్లలు. గత నెలలో ఆమె కుమారుడు జక్కంపూడి నాగరాజు ఇంటి ముందు ఉంటున్న లాల్‌బీ బంగారు చెవి బుట్టలు తాకట్టు పెట్టమంటే పెట్టి సొమ్ము తీసుకు వచ్చి లాల్‌బీకి ఇచ్చాడు. ఈ విషయంలో వివాదం వచ్చి లాల్‌బీ నాగరాజుపై కేసు పెట్టింది. ఆ తరువాత నాగరాజు ఇంటి నుంచి వెళ్లి పోయాడు. సోమవారం తన వాట్సాప్ నుంచి సోదరికి తాను చనిపోతున్నానని, తన బైక్, ఫోన్, లెటర్ ప్రకాశం బ్యారేజీ వద్ద ఉంచానని మెసేజ్ పెట్టాడు. కుటుంబ సభ్యులు ప్రకాశం బ్యారేజ్ వద్దకు వెళ్లి చూడగా బైక్, ఫోన్, లెటర్ దొరికింది. తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వంశీకి మద్దతుగా ప్రచారం

గన్నవరం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌కు మద్దతుగా గ్రామాల్లో ఆ పార్టీ నేతలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. కేసరపల్లి శివారు వీఎన్ పురం కాలనీలో గ్రామ కన్వీనర్ నిడమర్తి వినోద్ నేతృత్వంలో మంగళవారం గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా వంశీమోహన్‌ను, ఎంపీగా సింహాద్రి చంద్రశేఖర్‌రావు గెలిపించాలని కోరారు. వార్డు సభ్యులు గంట థెరిస్సా, పార్టీ నేతలు షేక్ అహ్మద్, పడమట రవి, పామర్తి బుజ్జి తదితరులు పాల్గొన్నారు. అల్లాపురంలో గ్రామ సర్పంచ్ డొక్కు సాంబశివ వెంకన్నబాబు నేతృత్వంలో వంశీమోహన్‌కు మద్దతుగా ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు.

వంశీ విజయాన్ని కాంక్షిస్తూ పూజలు

స్థానిక యాదవులపేట రామాలయంలో మంగళవారం పీఏసీఎస్ చైర్మన్ చిమట శ్రీనివాసరావు నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనే రావాలి

వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీ



వేలేరులో ఎన్నికల ప్రచారంలో వల్లభనేని వంశీ, పక్కన డాక్టర్ శివభరత్ రెడ్డి



మర్లపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద ప్రజలకు సంక్షేమం కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మరోమారు ప్రజలు పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీ మోహన్ కోరారు. బాపులపాడు మండలం వేలేరులో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి అవిర్నేని శేషగిరిరావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు ఎదురేగి ఆయనకు సాదర స్వాగతం పలికారు. గ్రామంలో అడుగడుగునా ఆయనకు విశేష ఆదరణ లభించింది. తొలుత ఎస్సీ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన తర్వాత వంశీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రచార రథంపై వంశీతో పాటుగా వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి ఉన్నారు. గ్రామంలోని ప్రతి వీధిలోనూ మహిళలు హారతులు పట్టారు. యువత బైక్ ర్యాలీ తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో హోరెత్తించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గన్నవరం ఎమ్మెల్యే, మచిలీపట్నం పార్లమెంట్ స్థానాలను అఖండ మెజార్టీతో గెలిపించాలని వంశీ కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ చోదిమెళ్ల సుందరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఎం.యోహాన్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొడాలి సత్య ప్రభాకర్, ఊసా జయప్రసాద్, పోలిమెట్ల యాకోబు పాల్గొన్నారు.

మర్లపాలెం బీసీ కాలనీలో...

గన్నవరం: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ మద్దతుగా నిలవాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పిలుపునిచ్చారు. గన్నవరం పంచాయతీ పరిధిలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత మర్లపాలెం బీసీ కాలనీ నుంచి ప్రారంభమైన ర్యాలీకి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అక్కడి నుంచి మర్లపాలెం మీదుగా స్థానిక ఎస్సీకాలనీకి చేరుకున్న వంశీమోహన్‌కు ప్రజలు బ్రహ్మరథం పలికారు. కాలనీవాసులందరూ రోడ్లపైకి చేరుకుని హారతులు పట్టడంతో పాటు తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తనపట్ల చూపిస్తున్న అభిమానానికి జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ గౌసాని, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, ఎంపీటీసీ తిరివీధి రవి, పార్టీ నాయకులు సర్నాల ఆంజనేయులు, తిరివీధి రంగారావు, నిడమర్తి రామారావు, న్యాయవాది తిరివీధి వెంకయ్య, క్రిస్టియన్ సెల్ నేతలు పేతురు, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో హ్యాట్రిక్ కొడతా: వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: వచ్చే ఎన్నికల్లో గన్నవరం ఎమ్మెల్యేగా మరోమారు తాను విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ చెప్పారు. బాపులపాడు మండలం శేరీ నరసన్నపాలెంలో సర్పంచ్ అడపా అంజిబాబు నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఇరవై ఏళ్లుగా గన్నవరం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, సొంత నిధులు వెచ్చిస్తూ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని, ఎమ్మెల్యేగా పదేళ్లుగా నియోజకవర్గంలో పలు దీర్ఘకాలిక ప్రజా సమస్యలు పరిష్కరించానని, గ్రామగ్రామాన అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. బుడమేరు, రామవరప్పాడులలో వంతెనల నిర్మాణం, పోలవరం కుడికాలువ, మల్లవల్లి ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు, గన్నవరం విమానాశ్రయం విస్తరణ వంటి పలు భూసేకరణ సమస్యలను ప్రజామోదంతో పరిష్కరించానని తెలిపారు. బ్రహ్మయ్య లింగం చెరువును రిజర్వాయర్‌గా తీర్చిదిద్దానని, దాదాపుగా పనులు పూర్తి కావచ్చాయని చెప్పారు. కరోనా కష్టకాలంలోనూ ఎంతో మందికి ఉచిత వైద్యం అందించామని, వందలాది ఆక్సిజన్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. టీడీపీ అభ్యర్థికి గన్నవరంలో శాశ్వత నివాసం కూడా లేదన్నారు. ఎన్నికలకు ఆరునెలలు ముందు వచ్చి పగటి వేషగాళ్ల మాదిరిగా హడావుడి చేసే వ్యక్తులను నియోజకవర్గ ప్రజలు విశ్వసించబోరని చెప్పారు. గతంలో మాదిరే ఈ ఎన్నికల్లోనూ ఓటమి చెందిన తర్వాత పార్టీని, నమ్ముకున్న కార్యకర్తలను వదిలిపెట్టి యార్లగడ్డ వెంకట్రావు అమెరికా వెళ్లిపోవటం ఖాయమన్నారు. డాక్టర్ దుట్టా రామచంద్రరావుతో తనకు ఎలాంటి విభేదాలు లేవని, ఆయన కుటుంబ సభ్యులు తనతో పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని చెప్పారు. గతంలో ఆయనపై చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణలు తెలిపానన్నారు.

వంశీకే డాక్టర్ దుట్టా మద్దతు

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ దుట్టా కుటుంబానికి వైఎస్సార్ కుటుంబంతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. యార్లగడ్డ వైఎస్సార్ సీపీలో ఉండగా, డాక్టర్ దుట్టాకు ఎమ్మెల్సీ పదవి రాకుండా అడ్డుపడ్డారన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంశీకే డాక్టర్ దుట్టా మద్దతు ఉంటుందని చెప్పారు.

కొట్లాట కేసులో ఆరుగురు అరెస్టు

- ప్రేమించిన అమ్మాయి కోసం ఘర్షణ పడిన యువకులు
- ముగ్గురికి గాయాలు
- పరారైన నిందితుల కోసం గాలింపు
- నిందితులను మీడియా ఎదుట హాజరుపర్చిన కంకిపాడు పోలీసులు



అరెస్టు చేసిన నిందితులను మీడియాకు చూపుతున్న కంకిపాడు సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్‌ఐలు

కంకిపాడు: ప్రేమించిన అమ్మాయి కోసం యువకుల మధ్య తలెత్తిన వాగ్వాదం ఘర్షణకు, కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో ఆరుగురు నిందితులను కంకిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో కంకిపాడు సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ డి.సందీప్, అదనపు ఎస్‌ఐ తాతాచార్యులతో కలిసి మీడియాకు వివరాలను వెల్లడించారు. పెనమలూరు మండలం వణుకూరు గ్రామానికి చెందిన ఓ అమ్మాయి ప్రేమ వ్యవహారంలో గోసాలకు చెందిన యువకులు బాజీ, మీరాబాషా, ఫిరోజ్‌లను ఉయ్యూరు, గంగూరు గ్రామాలకు చెందిన కొందరు యువకులు ఈనెల 21న కంకిపాడు ఫ్లైఓవర్ పక్కన డొంక ప్రాంతంలో ఆపి ఘర్షణకు దిగారు. ఘర్షణలో తీవ్రంగా గాయపడిన గోసాలకు చెందిన ముగ్గురు యువకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులు ఇచ్చిన ఫిర్యాదుతో అదే రోజు అర్ధరాత్రి సమయంలో కంకిపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, గన్నవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య ఆదేశాలతో ముమ్మరంగా దర్యాప్తు జరిపి ప్రాథమికంగా ఘర్షణలో పాల్గొన్న యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఉయ్యూరుకు చెందిన ఇలియాస్, జగదీష్, శశివర్ధన్, తోట్లవల్లూరు మండలం యాకమూరుకు చెందిన కార్తీక్, చింటు వర్ధన్, గంగూరు గ్రామానికి చెందిన సాలెం రాజులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వాస్తవాలను అంగీకరించటంతో నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ప్రధాన సూత్రధారులు, పాత్రధారులు పరారీలో ఉన్నారని, త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని సీఐ శ్రీనివాసరావు వెల్లడించారు.

గన్నవరం అసెంబ్లీకి ఆరు నామినేషన్లు దాఖలు

గన్నవరం: గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి మంగళవారం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థిగా కళ్లం వెంకటేశ్వరరావు తన నామినేషన్ పత్రాలను స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి గీతాంజలిశర్మకు అందజేశారు. కళ్లంకు డమ్మీ అభ్యర్థిగా టీవీ లక్ష్మణస్వామి మరో సెట్ నామినేషన్ సమర్పించారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పైలా అజయ్, బీఎస్పీ అభ్యర్థిగా సింహాద్రి రాఘవేంద్రరావు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా షేక్ చాన్‌బాషా, ప్రత్తిపాటి అరుణకుమారి నామినేషన్‌లు వేశారు.

పెనమలూరులో...

పెనమలూరు: పెనమలూరు అసెంబ్లీ స్థానానికి మంగళవారం తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థి మరీదు శశిధర్ నామినేషన్ వేశారు. రిటర్నింగ్ అధికారి డి.రాజుకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.

రామవరప్పాడులో అన్న సంతర్పణ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతంలోని పోలేరమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదిపరాశక్తి పోలేరమ్మతల్లి ఆలయ 36వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని భక్తులు పోలేరమ్మను దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. మధ్యాహ్నం పూజ అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కారక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కంకిపాడులో...

కంకిపాడు: నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కంకిపాడులోని లాకురోడ్డులో మంగళవారం అన్నసంతర్పణ నిర్వహించారు. రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ హాజరై రామాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, ఎంపీటీసీలు కోనా కిషోర్, దిట్టకాని ప్రసాద్, స్థానిక నాయకులు తంబాబత్తుల ఓంకారం, కంకిపాటి రమేష్, టి.శ్రీకాంత్, కె. వెంకటేశ్వరరావు, తంబాబత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభావంతులకు ప్రోత్సాహకం అందజేత



విద్యార్థిని తుమ్మల అఖిలను అభినందిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఉయ్యూరు: ప్రభుత్వ బడులు ప్రతిభావంతులకు నెలవుగా మారాయని లయన్స్‌క్లబ్ జిల్లా కేబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. ఉయ్యూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో అభినందించి రూ.10 వేలు నగదు పురస్కారం అందించారు. ఉయ్యూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన తుమ్మల అఖిల (588/600), సారెళ్ల అఖిల (573/600), పాలపర్తి రోహిణి (562/600)లను సత్కరించి, నగదు పురస్కారాన్ని అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పాటిస్తూ పల్లె విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దటం అభినందనీయమని లయన్స్‌క్లబ్ సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు సీహెచ్ కుటుంబరాజు, సురేష్‌బాబు, వీణవాహి ప్రసాద్, నెల్లి రాంబాబు, నల్లా శ్రీనివాస్, హెచ్ ఎం పి.శ్రీనివాసరావు, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక

గన్నవరంరూరల్: మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొమ్మినేని పార్థసారథి, ఇతర నాయకుల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొమ్మినేని మధుసూదనరావుతో సహా పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. కరోనా కష్టకాలంలో ప్రజలను కన్నబిడ్డల్లా కాపాడిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి బాసటగా ఉంటామన్నారు.

వైభవంగా నున్న పేరంటాళ్లమ్మ తిరునాళ్ల

నున్న(విజయవాడరూరల్): గత అయిదు రోజులుగా జరుగుతున్న నున్న గ్రామ పేరంటాళ్లమ్మ తిరునాళ్ల చివరిరోజు మంగళవారం పేరంటాళ్లు గోపిరెడ్డి-పార్వతమ్మ, చింతయ్య-వీరమ్మ, రామిరెడ్డి-నాగమ్మలకు మహిళా భక్తులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. నున్న గ్రామంతో పాటు పరిసర గ్రామాలైన పాతపాడు, విలేజి కండ్రిక, పాయకాపురం, సూరంపల్లి, రామచంద్రపాలెం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి భక్తులు ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. నాగమ్మ-రామిరెడ్డి పేరంటాలమ్మ గుడిదగ్గర నుంచి అమ్మవారికి పసుపు బండి బోనాలు సమర్పించారు. గ్రామ పెద్ద గోళ్ళ ఢిల్లీ వెంకటేశ్వరరావు ఇంటి నుంచి గొర్రెపొట్టేలును మేళతాళలతో ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు చేసిన అనంతరం సిడిబండికి కట్టారు. సిడిబండిపై భీమవరపు సుబ్బారెడ్డి ఆసీనులు కాగా గ్రామ పురవీధుల్లో సిడిబండి ఊరేగింపు కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్కారెడ్డి నరసింహారెడ్డి, కమిటీ సభ్యులు తిరునాళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు.

తేలప్రోలులో రంగమ్మ పేరంటాల తిరునాళ్లు ప్రారంభం

ఉంగుటూరు: తేలప్రోలు రంగమ్మపేరంటాల తిరునాళ్ల మొదటి రోజు మంగళవారం అంకగుడారాలు వేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై తరలి వచ్చారు. మొక్కుబడులు చెల్లించి పేరంటాలు ఆలయం చుట్టు ప్రదక్షణలు చేశారు.

రోబోటిక్ టెక్నాలజీపై సదస్సు

గన్నవరంరూరల్: రోబోటిక్ టెక్నాలజీలో నూతన ప్రయోగాలపై విద్యార్థులకు నిరంతర అవగాహన అవసరమని ప్రొఫెసర్ కె.ఫణిశ్రీనివాస్ అన్నారు. మాదలవారిగూడెం లింగయ్యాస్ ఇంజినీరింగ్ కళాశాలలో హెచ్‌సీఎల్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను వివరించారు. ఇమేజ్ ప్రాసెసింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్‌పై ప్రసంగించారు.

కాటూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా పూర్ణిమ

ఉయ్యూరు: వైఎస్సార్‌సీపీ కాటూరు ఇన్‌చార్జిగా మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు యలమంచిలి పూర్ణిమ వ్యవహరిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమాలు అన్నీ గ్రామంలో పూర్ణిమ పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. పార్టీ శ్రేణులు ఆమెకు సహకరించాలని, పార్టీ పటిష్టతకు పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

నామినేషన్‌కు తరలిరావాలి

వైఎస్సార్‌సీపీ పెనమలూరు అభ్యర్థిగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఈనెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారని, పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు తరలిరావాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మండల అధ్యక్షుడు దాసే రవి కోరారు. ఉదయం 10 గంటలకు ఉయ్యూరు వీరమ్మతల్లి ఆలయం నుంచి ర్యాలీ బయలుదేరుతుందని, ర్యాలీని విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



నియామకపత్రం అందజేస్తున్న ఏఎంసీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా

విజయవాడరూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామ శివారు మీనాక్షీపురంలో ఆజాద్ ముస్లిం కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు సదుపాయం కల్పిస్తే టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఆ రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ఆ మూడు పార్టీల అభ్యర్థులను చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు. గన్నవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్, ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌రావులను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలన్నారు. ముస్లింల సమస్యలను కమిటీ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కమిటీ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన వివరించారు. ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ ఆధ్వర్యంలో షేక్ నాగుల్‌మీరావలి ని గన్నవరం నియోజకవర్గ ఆజాద్ ముస్లిం కమిటీ యూత్ ప్రధాన కార్యదర్శిగా నియమించి నియామక పత్రం అందజేశారు. సమావేశంలో సెంట్రల్ యూత్ అధ్యక్షుడు అన్వర్ బేగ్, ఉపాధ్యక్షులు సర్వర్ బేగ్, ఎండీ ఇబ్రహీం పాల్గొన్నారు.

సిద్ధార్థలో ఇంజినీరింగ్ ప్రవేశాలపై ఉపకార వేతనాలు



ఫలితాలు ప్రకటిస్తున్న సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

పెనమలూరు: వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఈ విద్యా సంవత్సరం నుంచి సిద్ధార్థ అకాడమీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టూ బీ యూనివర్సిటీగా మార్పు చెందిందని సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు తెలిపారు. ఆయన మంగళవారం కాలేజీలో విలేకరులకు వివరాలు తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరం బీటెక్ కోర్సుల్లో ప్రవేశించే వారికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్రవేశ పరీక్షలు నిర్వహించామన్నారు. వాటి ఫలితాలు విడుదల చేస్తూ ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తూ ప్రవేశాలు ప్రారంభించామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అట్లూరి వెంకట రత్నప్రసాద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహించిన సిద్ధార్థ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌కు(ఎస్ఇఇఇ-24) విశేష స్పందన లభించిందన్నారు. ఎస్ఇఇఇ ర్యాంకులతో పాటు, జేఈఈ మెయిన్స్, ఎంసెట్, ఇంటర్ ఫలితాలు ప్రామాణికంగా తీసుకుని ప్రతిభ చూపిన 500 మంది విద్యార్థులకు 15 శాతం నుంచి 100 శాతం ఉపకార వేతనాలు ఇస్తామని అన్నారు. బీటెక్ ప్రవేశ పరీక్ష ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీఆర్‌సిద్ధార్థ.ఏసీ.ఇన్‌లో చూడాలన్నారు. సమావేశంలో కన్వీనర్ మలినేని రాజయ్య, డీన్ బావినేని పాండురంగారావు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

జగన్ నాయకత్వం ప్రజలకు అవసరం



సనత్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో కానూరు మాజీ సర్పంచి దేవభక్తుని సుబ్బారావు

పెనమలూరు: రాష్ట్రానికి జగన్ నాయకత్వం చాలా అవసరమని కానూరు మాజీ సర్పంచి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దేవభక్తుని సుబ్బారావు అన్నారు. కానూరు సనత్‌నగర్‌లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ సీఎం అయిన తరువాత పాలనలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి దూసుకుపోతున్నాయని తెలిపారు. మరల జగన్ సీఎం అయితేనే రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో నేతలు నాసిర్, ఎండీ అన్వర్, అబ్బులు, సుభాని, నయూమ్, గుల్జార్, నూర్, అబ్దుల్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురులో...

యనమలకుదురులో మంత్రి తనయుడు జోగి రాజీవ్ ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా అమలు జరిగిన సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నేతలు దశమంతరావు, కోసూరు నరేష్‌కుమార్, అనిల్‌రెడ్డి, లంకా కోటేశ్వరరావు, అష్రఫ్, కర్రా ఆదిశేషారావు, లతీఫ్, కరీం, ఇమ్రాన్, గుమ్మడి నాగరాజు పలువురు పాల్గొన్నారు.

కానూరులో వలంటీర్‌లు రాజీనామా

పెనమలూరు: కానూరులో పది మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి మంగళవారం మంత్రి జోగి రమేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సీఎం అయిన తరువాత తమను వలంటీర్లుగా నియమించే పేద వర్గాలకు సేవ చేసే అవకాశం కల్పించారని, తమ కృషితో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరాయని తెలిపారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలతో మనస్తాపానికి గురైన తాము తమ ఉద్యోగాలకు రాజీనామా చేశామని తెలిపారు.